'అట్టా అంటే నేనేమి సెప్పేది సార్!'

'నన్నడుగుమీ, సెప్పను. తప్పు మన్ది కానే కాదు పార్సార్థీ. మిస్టీక్ అంతా, ఆ పత్రికే, నా పత్రికే, ఇంకో పత్రికే, ఈ పత్రికల ఎడిటర్ల మీదదా వుండాది పార్సార్థీ. ఎట్టా రాయవలెనో వాళ్లకే తెలియకుండా పూడ్శింది చూదిరిగా వుండాదని తలుస్తును. లేక తెలిసికూడా ఈ పైత్తెకారి కొసం సేస్తావుండారో ఏమో!'

'అట్టాకూడా వుండవచ్చును సార్'

'ఏమిదా సేయవలెనో తెలియకుండా వుండాదే పార్సార్థీ'

'అట్టా అడగండిమీ సెప్తును. ఈ తెలుంగు పత్రికెల ఎడిటర్లనంతా ఒకసోటు సేర్సి, ఒక కాన్ఫరెన్సు మాదిరి ఏరేంజిసేసి. ఒకే ఒకమాదిరిగాదా రాయవలె అని రూలింగ్ సెయ్యవలె సార్!'

'సెభాష్. మంచి ప్లాన్ దా పార్సార్థీ. ఏమి ఉపాయం, అదదా. సక్కగావుండాది. నీబుత్తిని అట్టానే ఎత్తి వుడకవేసి పన్నంతో కలిపి తినవలె-నీకు ఈ ఐడియా ఎట్టదా తట్టింది పార్సార్థీ?'

'ఈ నడుమ ఒక పదహైదు దినాల కింద ఒక పత్రికె సూస్తినని సెప్తిని కదా సార్ - దాన్లో ఇండో - పాకిస్తాన్ ఎడిటర్ కాన్ఫరెన్సు విషయం సదివితిని - అదిదా ఐడియా సార్'

'నువ్వు యేమి బుత్తిశాలి పార్సార్థీ-నిన్ను ముర్ఖాళ్ అని ఏ షేతాని వెధవ అంటుడప్పా?'

'మీరుకూడా అట్టా అనుకోనే వద్దు సార్!'

స్కెచ్

# వత్తులూ, కత్తులూ....

అంగర వెంకట కృష్ణారావు

రోహిణి కార్తికె రోళ్ళు బద్దలవకపోయినా. రిక్షా వెంకడి నెత్తురు చెమటక్రిందమారి శేర్ల కొద్దీ కారుతూంది. గ్రీష్మర్తువంతా తనమీదే కేంద్రీకరింపబడి, తన చర్మాన్ని దొల్చుకొని చిరచిర లోన ప్రవేశిస్తూంది. అతడు చేతిని మొహానికి గొడుగు చేసుకుని కళ్ళు చింది సూర్యుడి వేపు చూసేడు.

సూర్యుడి మధ్య నీలిమ, దానిచుట్టూ ప్రచండాగ్ని కిరణాలు అతడి కళ్ళపై చీకట్లు క్రమ్మేయి. విశ్రాంతి తీసుకొంటూన్న రిక్షాపై కుడిచెయ్యి మోపి, నుదిటిపై యెడం చెయ్యి గొడుగుగా పెట్టి, నకనకలాడే పొట్టతో, గుటగుటమనే గుండెతో, అలాగే నిలబడి నిమ్మళంగా చూపుక్రిందకి జారుస్తుంటే, అది శేట్ రామ్‌లాల్ భవనం కిటికీవరకు వచ్చి అక్కడ ఆగిపోయింది.

అది చక్కనైన కిటికీ. దానిద్వారా లోని కెన్నోసారులు చూసేడు వెంకడు. వేసవిరాత్రులందు తెరచివుండి తెర లేనప్పుడు, ధగధగ మెరిసే పలురంగుల దీపకాంతి అతడికి, ఆ దృశ్యాలు ...ను మన్నదూరాన్ని కోటిరేట గుణించేది. ...కల వాటుగా వున్న 'ఫాన్' నీడ గోడ ...రగిర తిరుగుతూ వెంకడి వూహాల ...దృశ్యాల ప్రతిబింబాలు భ్రాంతిలా చూపించేది. అనునిత్యం వచ్చే రేడియో సంగీతం అతడిని వెక్కిరించేది.

ఆ మేడ కెదురుగా వున్న బట్టల దుకాణం అరుగే వెంకడి నివాసం. ఆ కాలువ ఒడ్డునే రిక్షాతలవంచి నిద్రపోతుంది రాత్రి ఒక గంట సేపు. అంచేత అర్ధరాత్రి పైగా వినిపించేది 'ఖంజిరా' మీద దబదబ మోదినట్టు తోలి యవ్వనపు గిలిగింత నవ్వులు. ఆ వెనక మసక మసక వెలుగులో యెదురుగోడమీద గతాగతకారులై పరుగెత్తే నీడలు చూస్తూ తనని తను మరిచిపోయేవాడు.

ఆవేళ మధ్యాహ్నం నిప్పులు చెరిగే యెండలో తిరిగి ఆవెపు చూసేడు. వట్టివేళ్ళ తడక కనుపించింది. అతడి నుదుటి మీంచి, కనుబొమలమీంచి చెమటబొట్లు టపటప కారేయి. ఎడమచెయ్యి గడ్డిమీదవేసి రిక్షాలో కూచుని, కుడిచేతితో నుదురు తుడుచుకుని గుటక వేసేడు. అలసట నిద్రారూపంలో పైన వాలుతూంటే, అతడు నుందంగా ఆలోచింపసాగేడు.

శేట్ రామ్‌లాల్ వొక మనిషి. తనూ వొక మనిషి కాని యెంత తారతమ్యం! అతడు మెడ పైకెత్తి, భవనంమీద భవనం పేరుస్తూంటే, తను నానాటికీ తలయెత్తేపాటి కూడా శక్తిలేక, తలవంచి, కళ్లు మాత్రం బరువుగా

యెత్తి, పెద్దమనుష్యుల పాదరక్షలనుబట్టి యెవరు రిక్షా యెక్కేవారో యెవరు కారో పోల్చుకుంటున్నాడు. 'లక్ష్మి' బలవంతులను వలచి వారిమెడలో వరమాల వేస్తూంటే, బలహీనులైన ధనవంతులు లక్ష్మిని బలవంతంగా తమ దాసిగా చేసుకుంటున్నారు. ఇలా పరుగెడుతూంది అతని ఆలోచన.

* * *

బంగారు నగిషీగల మఖుమలు జోళ్ళు తన వెంపు వస్తున్నాయి. బరువుగా కళ్లు యెత్తుతూంటే బండీఫుండమీద చేతికర్ర టకటకమంది. 'ఒరే రిక్షా!'—ఉలికిపడి లేచి తల యెత్తేడు. శేట్ రామ్‌లాల్! అతడు రిక్షాలో కూచున్నాడు వెంకడు బండియెత్తుకుని దౌడుతీసేడు

ప్రళయరుద్రుడి మూడో నేత్రంవలె సూర్యుడు అగ్ని క్రక్కుతూన్నాడు. పైన నెత్తి, అడుగున పాదాలు మాడుతున్నాయి వెంకడికి. నెత్తురు మరిగి కళ్ళల్లోంచి ఆవిరిగా వస్తూంది. గంట కొట్టుకుంటూ, జాపోస్తూ, కాళ్లెగరేసుకుని పరుగెడుతూంటే తన పరుగు అనంతంగా తోచింది. 'ఒరే రిక్షా!' అతనిలో గాండ్రిస్తూంది. ఇటీవల తన పేరు తనే మరిచిపోయేడు. అతడిని యెవరు పిలిచినా 'ఒరే రిక్షా' అనే.

ఈ యెడతెగని తారతమ్యానికి యెవరు కారకులు? మానవుడా? భగవంతుడా? మానవుడు కాదేమో? ఇది సృష్టిదోషం కామోసు! జగన్నాటక రంగంమీద రాజూ బంటు పాత్రల నిర్ణయమే సృష్టిరహస్యం కామోసు. తనే రిక్షాలో యెందుకు కూచోకూడదు? రామ్‌లాల్ బండీ ఎందుకు లాగకూడదు? ఇలా పరుగెడుతూ పరుగెడుతూ తన జీవితప్రయాణం హఠాత్తుగా యెక్కడో ముగిసిపోవలసిందేనా?

ఈ జిజ్ఞాస పుట్టిన క్షణంలో సూర్యుడి ప్రక్కగా ఒక పెద్ద మెరుపు మెరిసింది మేఘమన్నా లేకుండా. వెనువెంటనే ఒక ఫెళఫెళార్భటి వినిపించింది. వెంకడు హఠాత్తుగా ఆగిపోయి అటు చూసేడు.

రెండవ సూర్యుడిలా మెరిసిపోతూన్న వొక బృహత్కాయుడు తన నిడుపైన చేతులు జాచి రామ్‌లాల్‌ను పట్టి క్రిందికి దింపి, వెంకడిని రిక్షాలో కూర్చోపెట్టి, రిక్షా లాగమని రామ్‌లాల్‌ను ఆజ్ఞాపించి, అట్టహాసంచేసి అంతర్ధానమయేడు.

వెంకడు తనని తను పోల్చుకోలేక పోయేడు. బంగారు జలతారు పట్టుసెల్లాతో, తలమీద తురాయి చెమ్కీతో ధగధగ మెరిసిపోతున్నాడు. చేతిలో వెండి పిడికర్ర అమరింది. శేట్ రామ్‌లాల్ వాడిపోయి పీనుగులా మాడిపోయి, ఒకక్షణకాలం నిలబడి అటుఇటు చూసి, రిక్షాయెత్తుకుని పరుగు అరంభించాడు.

వెంకడి మనసు ఉప్పొంగ నారంభించింది. ఇన్నాళ్ళకి తన కోరిక ఫలించింది. బండ్లు ఓడలయేయి. కాలుమీద కాలేసుకుని తను కూచుంటే రామ్‌లాల్ జాపోస్తూ, ధారాపాతంగా చెమట కారుస్తూ, పెద్దపెద్ద అంగలేసుకుంటూ పరుగెడుతూన్నాడు. ఇదివరకు చూసిన మూడంతస్తుల మేడలన్నీ వెంకడికిప్పుడు బొమ్మరిళ్లలా అగపడుతున్నాయి. మనుష్యులూ, కారులూ, కీటకాలలా గోచరిస్తున్నాయి. అతడు వెనక్కి వాలబడి, మీసం మెలివేస్తూ, సగర్వంగా రామ్‌లాల్‌ను హెచ్చరిస్తున్నాడు వేగంగా లాగమని. చివరకి కోపం ఆపుకోలేక తన బెత్తంతో రామ్‌లాల్‌ను కొట్టడానికి చెయ్యెత్తేడు!!

కాని యెత్తిన చెయ్యి అలాగే వాలిపోయింది. తోటి మానవుణ్ణి పశువువలె చూసినందుకు తను పశువుకన్న హీనబుద్ధి అని గ్రహించాడు. వెంకడు తనలో రిక్షాలాగే వెంకడిని మరచిపోయి, యెన్ని జన్మలుగా తను రిక్షా లాగవలసి వుందో వూహించుకుని హడిలిపోయేడు. ఆకాశం వేపు చూసేడు. ఆగమన్నాడు రిక్షా.

రామ్‌లాల్ రిక్షా ఆపి, నిలబడి చేతితో నుదుటిపై చెమట ఓడ్చుకుంటూ బరువుగా వూపిరి తీసేడు. అతడి చెమటవేపు చూస్తే వెంకడికి ప్రపంచం అంతా పీడిత ప్రజల నెత్తురు వెల్లువలా గోచరించింది. రామ్‌లాల్‌ను కావిలించుకుని అతడు హోరున యేడ్చేడు!

* * *

బండిఫుండమీద టకటకమనే బెత్తం చప్పుడుకి వులిక్కిపడి లేచేడు వెంకడు. ఎంత కల అనుకుంటూ కళ్లు తెరుస్తూంటే బంగారు నగిషీగల మఖుమలు జోళ్లు కనుపించేయి. రామ్‌లాల్ రిక్షాలో కూచుని 'ఎత్తుకో' అన్నాడు. ఆవలిస్తూ దౌడు తీసేడు.

అదే సూర్యుడు! అదే చమ తమ్యం!